GV MALL®
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 114 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/- గురువారం 28 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# నారావారి పల్లెలో

## రామ్మూర్తినాయుడి కర్మక్రియలు

### .. హాజరైన సీఎం చంద్రబాబు

నారావారి పల్లెలో సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు జరిగాయి.



**చంద్రగిరి, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** నారావారి పల్లెలో సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ తోపాటు నారా కుటుంబసభ్యులు హాజరయ్యారు. రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీనటుడు నారా రోహిత్ కర్మక్రియలు నిర్వహించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్ పాటు పలువురు తెదేపా ఎమ్మెల్యేలు, నేతలు హాజరయ్యారు.

# ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు

## : సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు.




**హైదరాబాద్, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోవడం పై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు."విద్యార్థులకు పరిశుభ్ర వాతావారణంలో పౌష్టికాహారం అందజేయాలి. మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచాం. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. బాధ్యులైన వారిపై జిల్లా కలెక్టర్లు వేటు వేయాలి. వదంతులతో భయాందోళనలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల్లోంచి తొలగించేందుకూ వెనుకాడబోం" అని రేవంత్రెడ్డి హెచ్చరించారు.

# శ్రీవారి ఆలయం ముందు

## నలుగురు ఫొటోగ్రాఫర్లతో వైకాపా నేత ఫొటోషూట్

తిరుమల శ్రీవారి ఆలయం ముందు వైకాపా ఎంపీ అవినాష్రెడ్డి అనుచరుడు వంశీధర్రెడ్డి హల్చల్ చేశాడు.



**తిరుమల, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** తిరుమల శ్రీవారి ఆలయం ముందు వైకాపా ఎంపీ అవినాష్రెడ్డి అనుచరుడు వంశీధర్రెడ్డి హల్చల్ చేశాడు. నలుగురు వ్యక్తిగత ఫొటోగ్రాఫర్లలో ఆలయ ప్రాంగణంలో ఫొటోషూట్ నిర్వహించారు. ఇంత జరుగుతున్నా తితిదే విజిలెన్స్ సిబ్బంది పట్టించుకోలేదు. వంశీధర్రెడ్డి హంగామాపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఆయన వ్యక్తిగత సిబ్బంది మీడియా పై దురుసుగా ప్రవర్తించారు. గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన వైకాపా నాయకులపై తితిదే విజిలెన్స్, పోలీసులు కేసులు పెట్టారు. ఈ ఘటనలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.



# పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు

## : హరీశ్ రావు

పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు.




**హైదరాబాద్, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "మూసీ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోంది. కేంద్రం, పార్లమెంటుకు ఒకటి చెప్పి మరొకటి అమలు చేస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు పార్లమెంటుకు చెప్పారు.దేశంలో ఏ ప్రాజెక్టులోనైనా నిర్వాసితులను ఆదుకోవాలని 2013లో చట్టం తీసుకొచ్చారు. దానికంటే మెరుగైన చట్టం అమలు చేస్తే ఆయా రాష్ట్రాలు సొంతంగా కొత్త చట్టాలు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో భారాస హయాంలో మరింత మెరుగ్గా 2014లో భూసేకరణ చట్టం తీసుకువచ్చాం. నేడు అదే రాష్ట్రంలో అమలులో ఉంది. ఎన్యుమరేషన్ తర్వాత 60 రోజుల గడువు ఇచ్చి పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలి. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకొని మరో 30 రోజుల గడువు ఇస్తూ పీడీ నోటిఫికేషన్ ఇవ్వాలి. అభ్యంతరాలు నివృత్తి చేసిన తర్వాత ప్రక్రియ మొదలుపెట్టాలి. ప్రస్తుతం ఎన్యుమరేషన్ జరగలేదు.. పీడీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. డీపీఆర్ లేదు.. లబ్ధిదారులను గుర్తించలేదు" అని హరీశ్రావు విమర్శించారు.

# కేటీఆర్.. దిలావర్పూర్ రండి.. అక్కడే తేలుద్దాం

## : మంత్రి సీతక్క సవాల్



భారాస హయాంలోనే నిర్మల్ జిల్లా దిలావర్పూర్లో ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఇచ్చారని మంత్రి సీతక్క

**హైదరాబాద్, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** భారాస హయాంలోనే నిర్మల్ జిల్లా దిలావర్పూర్ లో ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఇచ్చారని మంత్రి సీతక్క అన్నారు. ఈవిషయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే పరిశ్రమకు అనుమతులు ఎవరు ఇచ్చారో మాట్లాడదామని.. దిలావర్పూర్ రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్లో గాంధీభవన్ వద్ద సీతక్క మీడియాతో మాట్లాడారు."భారాస హయాంలో ఎన్నో పరిశ్రమలకు కనీసం గ్రామసభలు కూడా నిర్వహించకుండా అనుమతులు ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన లక్షల ఎకరాల అసైన్డ్ భూములను రియల్ ఎస్టేట్ కోసం తీసుకున్నారు. ఇప్పుడు మాత్రం గ్రామసభల్లో ఒకరిద్దరిని రెచ్చగొట్టి అధికారుల పైకి ఉసిగొల్పుతున్నారు. ఇథనాల్ పరిశ్రమలో డైరెక్టర్గా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు ఏపీకి చెందిన పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు ఉన్నారు. ఆ పరిశ్రమకు అనుమతులు ఇచ్చే సమయానికి మరో డైరెక్టర్గా తలసాని కుమారుడు సాయి ఉన్నారు.కేటీఆర్.. ఎక్కడెక్కడో తిరగడం ఎందుకు? ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్లాం. ఎవరు అనుమతులు ఇచ్చారో అక్కడే తేలుద్దాం. మీ హయాంలోనే పరిశ్రమకు అనుమతులు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఒప్పుకోండి. ఈ అంశంపై ఆధారాలతో సహా త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తాం. అసెంబ్లీలో దీనిపై చర్చ పెడతాం. తప్పుడు ప్రచారాలతో ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరు" అని సీతక్క మండిపడ్డారు.

# కలెక్టర్ పై కేటీఆర్ వ్యాఖ్యలు.. ఖండించిన ఐపీఎస్ అధికారుల సంఘం

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఐపీఎస్ అధికారుల సంఘం ఖండించింది.

**హైదరాబాద్, నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం ఖండించింది. నిరాధార ఆరోపణలు చెడు ప్రభావం చూపుతాయని పేర్కొంది. ఈ తరహా వ్యాఖ్యలు బాధ్యతారహితం.. ప్రజాస్వామ్యానికి హానికరమని ఆక్షేపించింది. కలెక్టర్కు అండగా ఉంటామని తెలిపింది. సిరిసిల్లలో ఇటీవల నిర్వహించిన భారస సమావేశంలో కలెక్టర్ను ఉద్దేశించి కేటీఆర్ పలు వ్యాఖ్యలు చేశారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com

# కామేశ్వరి అమ్మవారికి బంగారు పూత కిరీటం బహుకరణ



మహానంది,నవంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్), మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవిఅమ్మవారికి రూ.2.25 లక్షల బంగారు పూత గల కిరీ టాన్ని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన భరత్ కుమార్ రెడ్డి, అనిత దంపతులు భక్తితో అందజేశారు. గురువారం స్వామి అమ్మవార్ల దర్శనార్థమే వచ్చిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా, ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి కి అందజేశారు. ఈవో దాతలను అభినందించి, స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

# సాంఘిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే

## :-ప్రజా సంఘాల నాయకులు

పాములపాడులో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు.



పాములపాడు, నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): పాములపాడు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాల నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు బీసీల జాతీయ కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు, జాతీయ బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్. గోపాల్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గట్టు.శంకర్ గౌడ్, బీసీ సంఘం యువజన నాయకుడు రాయపాటి. మురళీమోహన్, జాతీయ మలమానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల.అబ్రహం, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ లింగాల.స్వాములు, తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆయన మహారాష్ట్ర రాష్ట్రంలోని, పూణేలో 1827 ఏప్రిల్ 11న అట్టడుగు వర్గంలో జన్మించే నాటికి మనువాద ధర్మం నాలుగు పాదాల నడుస్తోందని, కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న అస్పృశ్యులలాగే సమాజంలో పురుషులకు సమానంగా ఏమాత్రం అవకాశాలు పంచుకునే పరిస్థితి స్త్రీలకు లేదని, ముఖ్యంగా బాలికలు పాఠశాలలకు వెళ్లి చదువుకోవడం తప్పుగా భావించేవారని, అటువంటి పరిస్థితులను మార్చాలని పూలే నడుంబిగించారన్నారు. మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించడానికి నాటి మనువాద సమాజం జీర్ణించుకోలేకపోయింది పూలే తండ్రికి ఊళ్లోని వారందరూ ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో సొంత తండ్రి అప్పటికే పెళ్లయిన పూలేను ఇంటి నుంచి వెళ్లగొట్టాడన్నారు. స్త్రీల విద్యను ముందు తన ఇంటి నుంచి ప్రారంభించారాన్నారు. పూలే నిరక్షరాస్తురాలైన తన భార్య సావిత్రిబాయికి తానే చదువు నేర్పి ఆమెను ఒక ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారన్నారు. మతం ద్వారా తాము ఎంత మోసానికి గురవుతున్నారో బడుగు వర్గాలకు తెలియ చెప్పడానికి తృతీయ రత్న వంటి నాటకాలు పెక్కు కవితలు రాశారన్నారు. ఆయన రాసిన గులాం గిరి వంటి గ్రంథాలు సమకాలీన సమాజపు పోకడలకు అద్దం పట్టాయనీ, ఎందరికో దిశా నిర్దేశం చేశాయన్నారు. వితంతువులకు అనాథ మహిళలకు, అనాథ బాలలకు, శిశువులకు శరణాలయాలు స్థాపించారన్నారు. పూలే దంపతులు బడుగు, బలహీనవర్గాల విజ్ఞాన వికాసాల కోసం సత్యశోధక్ సమాజ్ వంటి సంస్థలు స్థాపించారన్నారు. కార్మిక ఉద్యమ పితామహుడైన లోకండే ఆయనకు ప్రధాన అనుచరుడు అన్నారు. కార్మికులకే కాక, కర్షకుల ఉన్నతికి కూడా ఎన్నో రచనలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని వారి సమస్యల వైపునకు మళ్ళించడంలో పూలే విజయం సాధించారన్నారు. పూలేను బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక ఆదర్శమూర్తిగా గురువుగా పేర్కొని గౌరవించేవారన్నారు. నేటి యువత విద్యార్థులు పూలే జీవిత చరిత్రను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులతో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణ మోహన్ యాదవ్, సురేష్ యాదవ్, జి. శంకర్ గౌడ్, వేణు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, సాంబశివుడు, సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్-ఎస్. షర్ఫుద్దీన్ అలి, నాయకులు ఎం.జాన్ బాబు, ముద్రగడ శ్రీనివాసరావు, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

# ఆయన అందరికీ ఆదర్శం

82 నెలలుగా అవ్వకు అండగా మానవత్వం చాటుకున్న డాక్టర్ గంగన్న

ప్రతి నెల 1000 రూపాయలు సమకూరుస్తున్న గ్రంధాలయ అధ్యాపకులు



ఆళ్లగడ్డ నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్), బంధాలు అనుబంధాలకు రక్త సంబంధాలకు విలువ కట్టె సమాజంలో ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకుంటే ఏ ఆదరణకు నోచుకోని నిరాశ్రయులకు వృద్ధులకు లోటుండదని పలువురు సమాజ సేవకుడు, ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాల లైబ్రరీ అధ్యాపకులు, డాక్టర్ గంగన్న చేస్తున్న సేవలను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేస్తున్న సంఘటన ఆళ్లగడ్డ నియోజకవర్గ కేంద్రంలో సంతరించుకుంది.ఈయన వృత్తి ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాల గ్రంధాలయ అధ్యాపకులు.స్థానిక అళ్ళగడ్డ మండలంలోని ఓబులం పల్లె గ్రామ కాపురాస్తురాలిన షేక్ హుస్సేన్ బి 40 సంవత్సరాల క్రితం భర్తను మరియు బిడ్డను పోగొట్టుకొని నిలువ నీడ లేక తనకంటూ ఏ ఉ పాధి అవకాశాలు లేక పూట కూడా గడవని స్థితిలో ఉన్నటువంటి ఆమెకు ఆళ్లగడ్డ పట్టణంలోని గ్రంధాలయ అధ్యాపకులు,వైస్ ప్రిన్సిపల్ గారైనటువంటి డా : గంగన్న మరో సారి మానవతా దృక్పథం చాటుకున్నారు నేను నా కుటుంబం నా డబ్బు అని అనుకునే ఈ సమాజంలో జీవితం మీద ఆశలు వదులుకున్నటువంటి షైక్ హుస్సేన్ బి కి నిర్విరామంగాఅందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అనే నినాదంతో గత 82 నెలలుగా తన సొంత డబ్బును ఇచ్చిన మాటను నెరవేర్చుకోవాలని సంకల్పంతో ప్రతి నెల 1000 రూపాయలు ఇవ్వడమే కాక నిత్యవసర వస్తువులు కూడా తనకు సమకూరుస్తూ తనకు పెద్ద దిక్కుగా ఉన్నటువంటి గంగన్న కుటుంబాన్నిఆ దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తూ భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, అలాగే ఆయనను పలువురు ఆదర్శంగా తీసుకొని నిరాశరీలకు అండగా నిలవాలన్నారు

# వ్యవసాయాభివృద్ధి కోసమే సేంద్రియ ఎరువులు

అన్నదాతల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్య వినూత్న

ఆగ్రోటెక్ రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోండి





ఆళ్లగడ్డ నవంబర్ 28(రిపబ్లిక్ న్యూస్): అన్నదాతలు నష్టపోకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్ పి లక్ష్యమని మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బిల్లా రాజేష్ యాదవ్, డిజిఎం రాజేష్ బాబు లు తెలిపారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో వినూత్న ఆగ్రోటిక్ ఎల్.ఎల్.బి వారి ఆధ్వర్యంలో రైతు సోదరులకు సేంద్రియ ఎరువులు, సేంద్రియ వ్యవసాయంపైఅవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ అన్నదాతలు రేయి, పగలు శ్రమించి అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టి పంటల దిగుబడులు రావాలని కోరుకుంటారన్నారు. కానీ రసాయన ఎరువుల ద్వారా అనుకున్న స్థాయిలో అధిక దిగుబడులు సాధించడం కష్టమన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమిలో భూసారం పెరిగి పంటలు అధిగ దిగుబడులు వస్తాయన్నారు. తద్వారా రైతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు."వినూత్న ఆగ్రో టెక్ ఎల్.ఎల్.పి" సంస్థ రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ , టర్బో కే జి ఎఫ్6, రోషిని, ఉజ్వల్ , త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృధ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సం ||రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి



ఆళ్లగడ్డ నవంబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆళ్లగడ్డ రూరల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి పిలుపునిచ్చారు. గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణంలో సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలోఅంగన్వాడి కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు అనేవి ఒక సాంఘిక దురాచారమని పేర్కొన్నారు. గ్రామాలలో ఎక్కడైనా బాల్యవివాహాల సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే ఐసిడిఎస్ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు.బాల్యవివాహాలు చేసుకోవడం వలన ఎన్నోఅనార్థాలకు దారితీస్తుందన్నారు. బాల్య వివాహాలు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసుకుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.బాలికలకు విద్యా,భద్రత, తదితర వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురవు-తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మీదేవి తోపాటు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో ఎమ్మెల్యే దంపతులు పూజలు



మహానంది, నవంబర్ 28,(రిపబ్లిక్ న్యూస్): మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీశైలనియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, శైలజ దంపతులు పూజలు నిర్వహించారు. గురువారం స్వామివార్ల దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి,వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు.అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి అభిషేకార్చన పూజలను నిర్వహించారు.పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులురవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారామ్ బట్, హనుమంతు శర్మ, ఆంజనే-య శర్మలు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులుశ్రీశైలనియోజక వర్గం సమన్వయ కర్త బన్నురు. రామలింగారెడ్డి,మహా-నంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సీతారామాపురం శ్రీనివాసరెడ్డి,మహానంది మాజీ చైర్మన్ లు సురేష్ రెడ్డి, పాణ్యం ప్రసాద్, నరాల మౌళీశ్వర రెడ్డి, కంచర్ల శివ, గడ్డం నాగపులయ్య, గంగిశెట్టి మల్లికార్జున, రామచంద్రుడు,మాజీ సర్పంచ్ రాముడు, గాజులపల్లి రవిస్వామి, మహేశ్వర రెడ్డి, కిట్టు,నందిపల్లి మహేశ్వర రెడ్డి,గని చిన్న రంగస్వామి, మారెడ్డి సుబ్రహ్మణ్యం, అనిమేల శివ, ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాలలో 1వ వార్డులో క్షుద్ర పూజలు



నంద్యాల క్రైం, నవంబర్ 28,(రిపబ్లిక్ న్యూస్): నంద్యాల పట్టణంలోని ఒకటో వార్డులో అరుంధతి నగర్ (హరిజనవాడ)లో చేతబడి కలకలం రేపుతుంది. ప్రధాన కూడలిలో ఒక య-ువతి ఆకారపు బొమ్మ గీసి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి చేతబడి చేశారని స్థానికులు అంటున్నారు. ఘటనా స్థలంలో నిమ్మకాయలు, చెప్పులు, వెంట్రుకలు, కుంకుమ, పసుపు మొదలగునవి చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే కాలనీలో గతంలో కూడా ఇలాగే క్షుద్ర పూజలు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. ఎవరు చేశారన్న కోణంలో విచారణ చేపట్టారు.

# 'పుష్ప2' రిలీజ్.. రేసు నుంచి వైదొలగిన రష్మిక మరో సినిమా

రష్మిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఛావా'. ఈ సినిమా వాయిదా పడింది. ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది.





విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఛావా'. అత్యంత భారీ బడ్జెట్తో రూపొందిన ఈ చిత్రాన్ని మొదట డిసెంబర్ 6న విడుదల చేయాలని అనుకున్నారు. అయితే ఆ ముందు రోజు డిసెంబర్ 5న 'పుష్ప2' ఉండడంతో బాక్సాఫీస్ వద్ద క్లాష్ తప్పదని అందరూ భావించారు. ఈ రెండు సినిమాల్లోనూ రష్మికనే కథానాయిక కావడం విశేషం. తాజాగా 'ఛావా' విడుదల వాయిదా పడింది. ఫిబ్రవరి 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. అల్లు అర్జున్ 'పుష్ప2' డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. దీంతో 'ఛావా'ను వాయిదా వేయాలని చిత్రబృందం భావించింది. తాజాగా దీనిపై ప్రముఖ ట్రేడ్ ఎనలిస్ట్ తరణ్ ఆదర్శ్ పోస్ట్ పెట్టారు. 'ఫిబ్రవరి 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా 'ఛావా' ఫిబ్రవరి 14న విడుదల కానుంది' అని ఆయన పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ దీన్ని రూపొందించారు. ఇందులో శంభాజీ భార్య ఏసుబాయి పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ చిత్రం గురించి ఆమె ఓ సందర్భంలో మాట్లాడుతూ.. 'ఈ సినిమా మొత్తం ప్రేమమయమే. కథ, సంభాషణలే కాదు.. ఇందులో నటించినవారంతా ప్రేమను పంచినవారే' అని అన్నారు. ఇటీవల దీని టీజర్ విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. 'ఛావా' వాయిదా పడడంతో పుష్ప2 బాలీవుడ్లో సోలో రిలీజ్ నిలవనుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా దీని ఎడిటింగ్ ఫైనల్ వర్క్ పూర్తయినట్లు ఎడిటర్ నవీన్ నూలి పోస్ట్ పెట్టారు. సుకుమార్తో దిగిన ఫొటోను పంచుకున్నారు. వారం రోజుల్లో బిగ్ స్క్రీన్ పై సుకుమార్, అల్లు అర్జున్ మేజిక్ చూస్తారన్నారు.

# రిలేషన్షిప్.. ఎన్నో విషయాల్లో రాజీపడ్డా :అనన్యపాండే



**రిలేషన్షిప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి అనన్యపాండే, రిలేషన్ షిప్‌లో తాను ఎన్నో విషయాల్లో రాజీ పడ్డానని అన్నారు.**

రిలేషన్షిప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి అనన్య పాండే. ఇద్దరు వ్యక్తుల మధ్య నమ్మకం ఉంటేనే ఏ బంధమైనా బలపడుతుందని ఇటీవల ఓ పాడ్కాస్ట్లో తెలిపారు. "గతంలో నేను రిలేషన్షిప్లో ఉన్నాను. ఎదుటి వ్యక్తి కోసం నేనెంతగానో మారాను. చాలా విషయాల్లో రాజీపడ్డా. రిలేషన్షిప్ ప్రారంభమైనప్పుడు ఎదుటి వ్యక్తి మెప్పు పొందడం, వారి దృష్టిని ఆకర్షించడం కోసం ఏదైనా చేయాలనిపిస్తుంది. మనం ఎంత మారినా ఫర్వాలేదనిపిస్తుంది. మనం మారుతున్నామనే విషయం మొదట్లో మనకు అర్థం కాదు. ఇది సహజంగానే ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రేమలో ఉన్నప్పుడు లోపాలు తెలియవు. ఏదీ మనకు సమస్యగా అనిపించదు. ఆ బంధం నుంచి బయటకు వచ్చినప్పుడే మీకు అన్నీ అర్థమవుతాయి" అని అనన్య తెలిపారు. రిలేషన్షిప్ లో తాను నిజాయతీగా ఉంటానని ఆమె అన్నారు. ఎదుటి వ్యక్తి నుంచి కూడా అంతే నిజాయతీ లభిస్తే బాగుంటుందని తెలిపారు. తనకు కాబోయే వ్యక్తి.. అన్నివిధాలా అర్థం చేసుకునేవాడు అయి ఉండాలన్నారు. సింప్లిసిటీగా ఉండాలన్నారు. అనన్య గతంలో నటుడు ఆదిత్యరాయ్ కపూర్తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల వీరిద్దరూ విడిపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆంగ్ల పత్రికల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో రిలేషన్షిప్ గురించి అనన్య చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆదిత్యరాయ్ కపూర్ గురించే ఆమె మాట్లాడుతుందని పలువురు భావిస్తున్నారు. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు అనన్య పాండే. తొలి చిత్రంతోనే ఆమె గుర్తింపు సొంతం చేసుకున్నారు. లుక్స్ విషయంలో కెరీర్ ఆరంభంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. 'లైగర్'తో ఆమె తెలుగు వారికి చేరువయ్యారు. అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె విభిన్న కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవల ఆమె నటించిన 'సీటీఆర్ఎల్' మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె 'శంకరా' అనే సినిమా కోసం వర్క్ చేస్తున్నారు.

# అఖిల్ వివాహం.. అందుకు సంతోషంగా ఉన్నా: నాగార్జున



అక్కినేని ఇంట వరుస వివాహ వేడుకలు జరగనున్న విషయం తెలిసిందే. నాగార్జున పెద్ద తనయుడు నాగచైతన్య వివాహం మరో కొన్ని రోజుల్లో జరగనుండగా.. చిన్న తనయుడు అఖిల్ కూడా పెళ్లికి సిద్ధమయ్యారు. తన కుటుంబంలో వరుస శుభకార్యాలు జరగడంపై నాగార్జున ఎంతో ఆనందంగా ఉన్నారు. ఈవిషయాన్ని తెలియజేస్తూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఈ ఏడాది మా కుటుంబానికి ఎంతో ప్రత్యేకం. ఓవైపు నాన్నగారి శత జయంతి వేడుకలు జరుగుతున్నాయి. మరోవైపు నా తనయులిద్దరూ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నారు. డిసెంబర్ 4న నాగచైతన్య-శోభిత పెళ్లి జరగనుంది. పెళ్లి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నా తండ్రి స్థాపించిన అన్నపూర్ణ స్టూడియోస్లో ఈ పెళ్లి జరగడం ఆనందంగా ఉంది. మా కుటుంబం ఎంతో పెద్దది. అదేవిధంగా శోభిత వాళ్ల కుటుంబం కూడా పెద్దదే. కుటుంబసభ్యులు, తక్కువమంది అతిథుల సమక్షంలో గ్రాండ్గా చేయాలనుకుంటున్నాం. మా రెండో అబ్బాయి అఖిల్ కూడా వైవాహిక బంధంలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. జైనబ్ రద్దీ ఎంతో మంచి అమ్మాయి. ఇతరులపై ఎంతో ప్రేమ, అభిమానం కలిగిఉంటుంది. వారిద్దరూ కలిసి జీవితాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉంది. అఖిల్ జీవితాన్ని ఆమె పరిపూర్ణం చేయగలదు. ఆమెను సంతోషంగా మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. వచ్చే ఏడాదిలో వీరి పెళ్లి జరగనుంది" అని నాగార్జున తెలిపారు. అఖిల్-జైనబ్ నిశ్చితార్థం జరిగినట్లు మంగళవారం నాగార్జున ప్రకటించారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో నాగార్జున నివాసంలో ఈ వేడుక జరిగింది. "జైనబ్ తో మా తనయుడి నిశ్చితార్థం జరిగిందని తెలియజేస్తున్నందుకు ఆనందిస్తున్నాం. కోడలిగా జైనబ్ను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కాబోయే దంపతులకు మీ ఆశీస్సులు కావాలి" అంటూ ఆయన పోస్ట్ పెట్టారు. జైనబ్ చిత్రకారిణి, సోషల్మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి పేరుంది. మన దేశంలోనే కాక దుబాయ్, లండన్లోనూ ప్రదర్శనలిచ్చినట్లు తెలిసింది. ఆమె హైదరాబాద్లో పుట్టి ముంబయిలో స్థిరపడ్డట్లు సమాచారం. ఆమె తండ్రి జుల్ఫీ రద్దీ, నాగార్జునకు మధ్య కొన్నేళ్లుగా స్నేహం ఉంది. జైనబ్కు రెండేళ్ల క్రితం అఖిల్తో పరిచయం ఏర్పడిందని.. ఆ తర్వాత అదికాస్త ప్రేమగా మారిందని తెలుస్తోంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1890 :** ప్రముఖ తత్వవేత్త జ్యోతీరావ్ పులే మరణం (జ.1827).
- **1931 :** రెండవ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.
- **1952 :** భారతీయ జనతా పార్టీకి చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు అరుణ్ జైట్లీ జననం.
- **1954 :** ఇటాలియన్ భౌతిక శాస్త్రవేత్త, ఎన్ రికో ఫెర్మి మరణం (జ.1901).
- **1962 :** ప్రముఖ భారతీయ గాయకుడు, నటుడు కె.సి.డే మరణం (జ.18973). (చిత్రంలో)
- **1997 :** ఐ.కె.గుజ్రాల్ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల తరువాత పడిపోయింది.
- **2008 :** భారత సైనిక దళంలో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ మరణం (జ.1977).
- **2011 :** తెలుగు సినిమా నటుడు అక్కినేని నాగేశ్వరరావు భార్య అక్కినేని అన్నపూర్ణ మరణం (జ.1933).



జ్యోతీరావ్ పులే



రౌండ్ టేబుల్ సమావేశం




అరుణ్ జైట్లీ



ఎన్ రికో ఫెర్మి



కె.సి.డే



ఐ.కె.గుజ్రాల్



మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్



అక్కినేని అన్నపూర్ణ

## తెలుసుకోండి



బిరుబాలా రభా



"మంత్రగత్తెలు, క్షుద్రపూజలు వంటివి సాదరణంగానే చాలా మంది దృష్టిని ఆకర్శిస్తాయి. బిరుబాలా రభా మహిళలది అస్సాంలోని ఒక మారు మూల గ్రామం. అక్కడి ప్రజలు ఎక్కువగా మంత్రగత్తెలను, మూడనమ్మకాలను ఎక్కువగా నమ్ముతు ఉండేవారు. అ ఊరిలో ఏదైనా తప్పు జరిగితే వారికి అనుమానంగా ఉండే మహిళను మంత్రగత్తె అని ముద్రవేసి నిందించేవారు. వేధించేవారు. ఇది నిజమేనెమో అని మొదట బిరుబాలా రభా కుడా నమ్మేవారు. బిరుబలా కుమారుడు అనారోగ్యం పాలైతే. అతను మంత్రగత్తెలచే శపించబడ్డాడు. కొన్ని రోజుల్లో చనిపోతాడాని ప్రచారం జరిగింది. కానీ తన కొడుకు టైఫాయిడ్ వచ్చిందని తెలుసుకొని మంచి వైద్య చికిత్స చేయించడంతో వెంటనే అతను కొలుకున్నాడు. ఇకా అప్పటినుంచి మంత్రగత్తెల గురించి చెప్పే కథలు నమ్మడం ఆపేశారు. ప్రజలను ఎడ్యుకేట్ చేస్తూ వారిలో అవగహన కల్పించడం మొదలు పెట్టారు. ఇలా మంత్రగత్తెలు అనే పేరుతో మహిళల పై జరుగుతున్న దారుణాల పై వ్యతిరేఖంగా పోరాడి మహిళల కోసం ఎంతో కృషి చేసినందుకు గాను 2021 భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది."

అస్సాంలోని గోల్పారా జిల్లాలో మేఘాలయ సరిహద్దుకు సమీపంలోని ఠాకుర్విలా గ్రామంలో 1954లో రభా జన్మించింది. ఆమెకు ఆరేళ్ళ వయస్సు ఉన్నప్పుడు ఆమె తండ్రి మరణించాడు, దీంతో ఆమె పాఠశాల మానేసి, ఇంటిని నడపడానికి తల్లికి సహాయం చేయవలసి వచ్చింది. రభాకు పదిహేనేళ్ల వయసులో రైతు అయిన తన భర్తను వివాహం చేసుకున్నది. ప్రారంభంలో, రభా ఠాకుర్విలా మహిళా సమితి అనే మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇది తన స్థానిక గ్రామంలో మంత్రగత్తె వేటతో సహా వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తుంది. తరువాత 2006లో అస్సాం మహిళా సమతా సొసైటీలో పాల్గొంది. **2011లో ఆమె మిషన్ బిరుబాలాను స్థాపించింది.** సామాజిక కార్యకర్తలు, ప్రాణాలతో బయటపడినవారు, న్యాయవాదుల నెట్‌వర్క్‌తో ఏర్పడిన లాభాపేక్షలేని సంస్థ. ఇది మంత్రగత్తె వేటకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, వ్యాప్తి చేయడం, అలాగే అస్సాం రాష్ట్రం అంతటా మంత్రగత్తె వేటలో ప్రాణాలతో బయటపడినవారికి, సంభావ్య బాధితులకు మద్దతు ఇవ్వడం, రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రగత్తెల నమ్మకాన్ని సమర్థించే వారి నుండి అపహాస్యం, దాడులను ఎదుర్కొన్నప్పటికీ, స్వయంగా మంత్రగత్తె ఆరోపణలకు గురైనప్పటికీ, రాభా తరచుగా సమావేశాలలో మంత్రగత్తె, వేటకు వ్యతిరేకంగా మాట్లాడింది, అవగాహన శిబిరాలను నిర్వహించింది. ఈ అభ్యాసాన్ని ఖండిస్తూ పాఠశాల పాఠాలు బోధించింది. ఆమె గత దశాబ్దంలో **మంత్రగత్తెలుగా ముద్రపడిన ముప్పై ఐదు మందికి పైగా మహిళలను రక్షించింది.** అస్సాంలో మంత్రగత్తెలకు వ్యతిరేకంగా చేసిన కృషికి గాను రభా అనేక అవార్డులు, ప్రశంసలతో గుర్తింపు పొందింది. 2005లో ఈశాన్య నెట్‌వర్క్ (అస్సాంలో పనిచేస్తున్న మహిళా హక్కుల సంస్థ) ఆమెను **నోబెల్ శాంతి** బహుమతికి నామినేట్ చేసింది. 2015 లో గౌహతి విశ్వవిద్యాలయం నుండి **గౌరవ డాక్టరేట్** పొందింది. 2021లో ఆమె సామాజిక సేవ, ప్రచారం కోసం భారత ప్రభుత్వం ఆమెను గుర్తించింది. **ఇది భారతదేశంలో నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో సత్కరించింది.**

2024 మే 13న జిఎంసిహెచ్‌లోనిని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అన్నవాహిక క్యాన్సర్‌తో రభా తన 70వ యేట మరణించింది.

## ఇంటి చిట్కాలు

# దోశ ఇడ్లీ పిండి మిక్సీ పట్టేటప్పుడు ఒక స్పూన్ వీటిని కలిపితే పిండి చక్కగా పులుస్తుంది

మన ఇండియన్ బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ చాలా మంది ఇష్టంగా తింటారు. చలికాలంలో వీటిని చేయాలంటే పిండి సరిగా పులవదు. ఈ కాలంలో పిండి సరిగా పులవదు. అలా కాకుండా ఈ చలికాలంలోనూ పిండి సరిగ్గా పులవాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి. చలికాలంలో ప్రతి ఒక్క విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అలానే ఫుడ్ విషయంలో కూడా. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ చేసినప్పుడు మనం ఎక్కువగా మనం ఇడ్లీ, దోశ చేస్తాం. అలా చేసినప్పుడు ముందుగా పిండిని నానబెడతాం. అయితే, ఈ పిండి ఎంత బాగా పులిస్తే అంత బాగా వస్తాయి టిఫిన్స్. కానీ, చలికాలంలో పిండి ఎక్కువగా పులవదు. ఆ పిండితో దోశ కానీ ఇడ్లీ కానీ చేస్తే గట్టిగా రాళ్ళలా వస్తాయి. అలాకాకుండా ఎలా పిండిని మిక్సీ పట్టాలి. ఎలా స్టోర్ చేయాలో తెలిస్తే పిండి చక్కగా పులుస్తుంది. మీరు ప్రతీ సీజన్‌లా బ్రేక్‌ఫాస్ట్‌ని ఎంజాయ్ చేయొచ్చు. అందుకోసం ఏం చేయాలో తెలుసుకోండి.



### మరమరాలు, మెంతులు..



పిండిని నానబెట్టేటప్పుడు టీ స్పూన్ మెంతులు కూడా వేసి నానబెట్టండి. దీంతో దోశలకి మంచి రంగు వస్తుంది. పిండి కూడా బాగా పులుస్తుంది. దీంతో పాటు మరమరాలు కలపండి. అవి కూడా దూదిలా ఉండే మరమరాలు కలిపితే పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా దోశలు, ఇడ్లీలు చక్కగా వస్తాయి.

### సరైన భాగాల్లో..

పిండి నానబెట్టేటప్పుడు మనం ఇడ్లీ రవ్వ, మినపప్పు, దోశకి బియ్యం ఇవన్నీ కూడా ఎంతమోతాదులో తీసుకోవాలో తెలిసి ఉండాలి. అప్పుడే ఇడ్లీ, దోశ పెర్ఫెక్ట్‌గా వస్తాయి. పిండి కూడా ఎక్కువగా పులుస్తుంది. కొంతమంది దోశల పిండికి బియ్యం ఎక్కువగా, మినపప్పు వేస్తారు. అదే విధంగా, ఇడ్లీకోసం మినపప్పు ఎక్కువగా రవ్వ తక్కువగా కలుపుతారు. అలా కాకుండా సరైన మోతాదులోనే తీసుకోండి.



### వేడినీటితో మిక్సీ పట్టడం..




మిక్సీ పట్టేటప్పుడు చాలా మంది నీటిని కలుపుతుంటారు. అయితే, చలికాలంలో వేడి నీరు మరీ ఎక్కువ వద్దు.. కొద్దిగా గోరువెచ్చని నీటిని పోసి మిక్సీ పట్టండి. దీని వల్ల త్వరగా పులుస్తుంది. అయితే, మరీ ఎక్కువ నీరు పోస్తే మిక్సీ జార్స్ పాడయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి, తక్కువగా అంటే గోరువెచ్చని నీరు మాత్రమే వాడండి.

### వేడిగా ఉన్న ప్రాంతంలో..

అదే విధంగా పిండిని వేడి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పెట్టండి. స్టౌ దగ్గర పెట్టడం మంచి పని. అదే విధంగా, ఎక్కువ టైమ్ పులియడానికి చూడండి. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా, పిండిని ఉంచే గిన్నెలు కూడా కరెక్ట్‌గా ఉండేలా చూడండి. ఎలాంటి గ్యాప్ ఉండొద్దు.

### స్టీమింగ్..



మరీ ఎక్కువగా చల్లగా ఉన్నప్పుడు ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. అదేంటంటే.. మిక్సీ పట్టిన పిండిని గిన్నెలో వేసి మరిగిన నీరు ఉన్న మరో గిన్నెలో పెట్టి దీనిని కప్‌బోర్డ్‌లో ఉంచి రాత్రంత్రా అలానే ఉంచండి. దీని వల్ల పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా మైక్రోవేవ్‌లో కాసేపు ఉంచినా పిండి చక్కగా పులుస్తుంది.

### బేకింగ్ సోడా..




అదే విధంగా, కొద్దిగా మనం బేకింగ్ సోడా కలపొచ్చు. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అయితే, ఇది ఆప్షనల్ మాత్రమే. ఎక్కువగా బేకింగ్ సోడా వద్దు. దీని వల్ల సమస్యలొచ్చే అవకాశం ఉంది.